నేటినుంచి మెదడువాపు నివారణ టీకాలు

» వచ్చే నెల 25వరకు కొనసాగింపు

రంగారెడ్డి అర్బన్, జూలై 24 : మెదడు వాపు నివారణకు నేటినుంచి ఆగస్టు 25వ తేదీ వరకు 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు వ్యాక్సిన్ వేసేందుకు వైద్యశాఖ ఏర్పాట్లు చేసింది. జిల్లాలో 2,57,000మందికి వ్యాక్సిన్ వేసేందుకు 2,500 మంది ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పల్లె దవాఖానాల్లో వ్యాక్సినేషన్ వేసేందుకు ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు.


నేడు అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇదే జిల్లా నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తుండడంతో జిల్లాకు నిధుల వరద పారుతుందని ఆశిస్తున్నారు. అన్ని రంగాలకు కావాల్సిన నిధులను కేటాయించి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తారన్న ఆలోచనలో ఉన్నారు. అయితే, ఉమ్మడి జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు దూసుకు పోవాలంటే బడ్జెట్‌లో ఏ రంగానికి ఎలా నిధులు కేటాయించాలనే దానిపై జోరుగా చర్చ సాగుతోంది. ఈ సారి రాష్ట్ర బడ్జెట్‌లో తమ వర్గాలకు ప్రాతినిధ్యం ఎలా ఉండాలనే దానిపై ఆయా వర్గాల ప్రజలు ఒక అంచనాతో ఉన్నారు. మరి, వీరి ఆశలకు అనుగుణంగా బడ్జెట్ ఉంటుందా.. లేదా?. ఎవరికి లాభం చేకూరుతుందో తెలియాలంటే మరి కొన్ని గంటలు ఆగాల్సిందే.



- పాలమూరును పరుగులు పెట్టించాలి
- రియల్‌కు అండగా నిలవాలి
- ఉమ్మడి జిల్లా అభివృద్ధికి పెద్దపీట వేయాలి
- అన్నదాతకు చేయూతనివ్వాలి
- పర్యాటకానికి ప్రాధాన్యం కల్పించాలి
- సీఎం, స్పీకర్ ఇదే జిల్లాకు చెందిన వారు కావడంతో మరిన్ని ఆశలు
- నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క

విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలి

విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని 1986లో కొఠారి కమిషన్ నివేదించింది. కానీ.. ఇప్పటి వరకు బడ్జెట్ కేటాయింపులో ఎక్కువలో ఎక్కువ 6 శాతం మించలేదు. ఈ సారి విద్యారంగానికి బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు కేటాయించాలని ఉద్యోగులు, విద్యార్థులు కోరుకుంటున్నారు. అలాగే రెండో పీఆర్సీ సమయం ముగిసింది. కొత్త పీఆర్సీకి నిధులు కేటాయించాలని, పెండింగ్ బిల్లులకు మోక్షం కల్పించాలని ఆశిస్తున్నారు. మూతబడిన అన్ని స్కూళ్లను తెరిపించి మెరుగైన సదుపాయాల కల్పనకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుకుంటున్నారు.



పర్యాటకాభివృద్ధి ముందుకు సాగేనా..!



అనంతగిరి కొండలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న సంకల్పం ముందుకు సాగడం లేదు. అనంతగిరిని ఎకో టూరిజంగానే కాకుండా టెంపుల్ టూరిజం, వెల్‌నెస్ టూరిజం, అడ్వంచర్ టూరిజంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉన్నా ప్రభుత్వాల ఉదాసీన వైఖరి కారణంగా పర్యాటక కేంద్రంగా అనంతగిరి అభివృద్ధికి నోచుకోవడం లేదు. హైదరాబాద్‌కు సమీపంలో అనంతగిరి కొండల వంటి ఆహ్లాదకరమైన ప్రాంతం మరొకటి లేకపోవంతో ఇక్కడికి వారాంతాల్లో అధిక సంఖ్యలో వస్తుంటారు. పర్యాటకాభివృద్ధి పేరిట కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అనంతగిరి కొండల్లో హరిత వ్యాలీ వ్యూ రిసార్ట్ నిర్మాణం చేపట్టగా, ఆ తరువాత ఇప్పటి వరకు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే పనులు ముందుకు సాగలేదు. అనంతగిరి కొండలను పర్యాటకపరంగా అభివృద్ధి పరిస్తే సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అనంతగిరి కొండలతో పాటు కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టులను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి పరిచేందుకు రూ.200 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినా నిధులు మంజూరు కాక పనులు ముందుకు సాగలేవు. స్వచ్ఛ దర్శన్ కింద రూ.110 కోట్లతో అనంతగిరి కొండల్లో 213 ఎకరాలను పర్యావరణ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరిచే పనులు ఇంకా ముందుకు సాగడం లేదు. బృహత్తర ప్రణాళికతో అనంతగిరిని పర్యాటక పరంగా అభివృద్ధి పరిచేందుకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.

నాపరాయి పరిశ్రమకు రాయితీలు ఇవ్వాలి



తాండూరు నాపరాతి పరిశ్రమను గట్టెక్కించేందుకు కర్ణాటక తరహా పాలసీని ప్రభుత్వం ప్రకటించాలని నాపరాయి వ్యాపారులు కోరుతున్నారు. కర్ణాటకలో రాయల్టీ ఫీజు రూ.800 ఉండగా తాండూరులో రూ. 2,850 ఉందని వ్యాపారులు వాపోతున్నారు. క్వారీ లీజుల పునరుద్ధరణ, లీజ్ బదిలీ దరఖాస్తు ఫీజులు తగ్గించేలా చూడాలని వ్యాపారులు కోరుతున్నారు. తాండూరు మండలం జిన్‌గుర్తి గేటు వద్ద ఏర్పాటు చేయాల్సిన పారిశ్రామిక వాడ దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉంది. ఈ పరిశ్రమ వాడ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు. ఇది ఏర్పాటైతే 500 పాలిషింగ్ యూనిట్లు ఒకేచోటకు వచ్చి పెద్ద ఎత్తున యువతకు ఉపాధి లభిస్తుందని వారు చెబుతున్నారు.

భట్టిగారి బడ్జెట్ ఇలా ఉండాలి!

రాష్ట్ర బడ్జెట్‌పై వివిధ వర్గాల మనోగతం

వికారాబాద్, (ఆంధ్రజ్యోతి), రంగారెడ్డి అర్బన్/పరిగి/తాండూరు/ఆమనగల్లు/షాద్‌నగర్, జూలై 24 : ఎన్నో ఆశలు, భారీ అంచనాల మధ్య నేడు అసెంబ్లీలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అయితే. ఏ రంగాలకు ఎలాంటి మెరుపులు ఉంటాయనే దానిపై ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి సారిగా ప్రవేశ పెడుతున్న ఈ బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ వర్గాల ప్రజలు, నిరుద్యోగ యువత, రియల్టర్లు, మహిళలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా ఆరు గ్యారంటీలకు నిధుల కేటాయింపుపై ఉమ్మడి జిల్లాలో జోరుగా చర్చ సాగుతోంది.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు పెద్దపీట వేయాలి



రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయాలని రైతాంగం కోరుతోంది. ఉమ్మడి జిల్లాకు సాగునీరు అందించే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణంతో పాటు, గతంలో ప్రతిపాదిత చేవెళ్ల-ప్రాణహిత ద్వారా కూడా జిల్లా సాగునీరు అందించేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని, కోట్‌పల్లి, లక్నాపూర్,జుంటుపల్లి, హస్నాబాద్, తదితర చెరువుల ఆధునీకరణకు నిధులు కేటాయిస్తారన్న ఆశతో రైతులు ఉన్నారు. రైతులను ఆదుకునే విధంగా భారీగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలని రైతులు అంటున్నారు. కౌలు రైతులకు కూడా ఆదుకునేందుకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుకుంటోంది. అదేవిధంగా రైతు, పంటల బీమాలను కొనసాగించాలని, గతంలో మాదిరిగా రాయితీపై వ్యవసాయ యంత్ర, పరికరాలు, బిందు,సూక్ష్మ సేద్యం అవసరపడే పరికరాలు అందజేసేందుకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు తగ్గించి, రాయితీపై ప్రభుత్వమే సరఫరా చేయాలని ఆశిస్తున్నారు. జిల్లాలో పెద్దగా సాగునీటి వనరులు లేవు.

యువ వికాసం వెలిగేనా?



కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో భాగంగా యువ వికాసం పథకం కింద రూ. 5లక్షల విద్యా భరోసా కార్డు, ప్రతీ మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తానని భరోసా ఇచ్చింది. ఇప్పటికే డీఎస్సీ పరీక్షలు జరుతున్నాయి. అయినప్పటికీ.. నిరుద్యోగ సమస్య పూర్తిస్థాయిలో తీరేలా లేదు. చదువుకున్న యువత ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్నారు. ఉన్నత స్థాయిలో విద్యను అభ్యసించిన నిరుద్యోగులకు ఆశించిన ఉద్యోగాలు రావడం లేదు. ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో, ఐటీ రంగంలో స్థానిక రిజర్వేషన్ కల్పించేలా అసెంబ్లీలో తీర్మానించాలని నిరుద్యోగులు కోరుకుంటున్నారు. ప్రభుత్వం నిర్వహించే పరీక్షలు లీకేజీలు లేకుండా పకడ్బంది చర్యలు తీసుకోవాలని నిరుద్యోగుల కోరుకుంటున్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పనగా ప్రత్యేక పారిశ్రామిక విధానాన్ని తీసుకు వచ్చి, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించాలని ఆశిస్తున్నారు.

గిరిజనుల సంక్షేమానికి రూ. 20వేల కోట్లు కేటాయించాలి



రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో తండాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ. 20 వేల కోట్లు కేటాయించాలని గిరిజనులు కోరకుఉంటున్నారు. ప్రతీ మండల కేంద్రంలో గిరిజనులకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ప్రారంభించి సీబీఎస్ఈ సిలబస్‌తో విద్యను అందించేలా బడ్జెట్‌లో రూ. వెయ్యికోట్లు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుకుంటున్నారు. నిరుద్యోగ గిరిజన యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రత్యేక గిరిజన వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాలు నెలకొల్పాలని కోరుకుంటున్నారు. గిరిజన కార్పొరేషన్‌కు రూ. వెయ్యి కోట్లు కేటాయించి షరతులు లేకుండా 100 శాతం సబ్సిడీతో రుణాలు అందించేలా బడ్జెట్‌లో రూపొందిస్తారని గిరిజనులు ఆశిస్తున్నారు.

రియల్ పరుగులు పెట్టేనా?



రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్ధత నెలకొంది. వ్యాపారం పడకేసింది. భూముల క్రయ విక్రయాలు తగ్గిపోయాయి. లే అవుట్లలో ప్లాట్లు అమ్ముకోవడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు నానా పాట్లు పడుతున్నారు. కోట్లాది రూపాయలు అప్పులు తెచ్చి రియల్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టిన వారు లబోదిబోమంటున్నారు. శాసనసభ ఎన్నికల నుంచే రియల్ ఎస్టేట్ మార్కెట్ నెమ్మదిగా ఉంటే.. ఇప్పుడు కొత్తగా భూముల ధరలు పెంచుతామని ప్రభుత్వం ప్రకటించింది. భూముల ధరల పెరుగుదల అంశం కొనుగోలుదారులపై మరింత భారాన్ని మోపుతోంది. ఫార్మా రద్దు ప్రకటనతో అక్కడ రియల్ రంగం కుదేలైంది. రియల్ ఎస్టేట్ రంగం వృద్ధిని కొనసాగించేందుకు మెరుగైన ఆర్థిక వృద్ధికై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర బడ్జెట్‌లో ఈ రంగానికి బడ్జెట్ కేటాయించాలని రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన వారు కోరుకుంటున్నారు. భూముల విలువ పెంచొద్దంటున్నారు.

మహాలక్ష్మి'కి మరిన్ని నిధులివ్వాలి



ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఇప్పటికే మహాలక్ష్మీ పథకాన్ని అమలు చేయడంతో దీని ద్వారా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. ఈ పథకం ద్వారా ఉపాధి, ఉద్యోగానికి వెళ్లే మహిళలకు కొంత ఊరట లభిస్తుంది. అలాగే మహాలక్ష్మి పథకంపై ప్రతీ నెల రూ.2500 పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ఎంతోమంది మహిళలు దీనిపై ఆశలు పెట్టుకున్నారు. ప్రతి విద్యార్థి, విద్యార్థినులకు ఉచిత ఇంటర్నెట్ వైఫై సౌకర్యం కల్పించనున్నట్లు, 18 సంవత్సరాలు పైబడి, చదువుకొనే ప్రతీ యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్ ఉచితంగా అందజేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అలాగే స్వయం సహాయక బృందాలకు పావలా వడ్డీతో రుణ పరిమితిని రూ. 10 లక్షల వరకు పెంచనున్నట్లు ప్రకటించింది. పుట్టిన ప్రతి ఆడబిడ్డకు ఆర్థిక సహాయంతో కూడిన బంగారు తల్లి పథకాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటించింది. దీంతో నేడు ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో మరిన్ని నిధులు కేటాయించాలని కోరుకుంటున్నారు.

రైతాంగానికి చేయూతనిచ్చేలా ఉండాలి



రాష్ట్ర బడ్జెట్ రైతాంగాన్ని ఆదుకునేలా ఉండాలి. రైతుభరోసా ఇవ్వాలి. గతంలో మాదిరిగా రాయితీపై యంత్రాలు, పరికరాలకు నిధులు కేటాయించాలి. నాణ్యతమైన విత్తనాలను రాయితీపై ప్రభుత్వమే సరఫరా చేయాలి. ఎరువుల ధరలు తగ్గించాలి. పంటలను గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

-ఎ.సత్యనారాయణరెడ్డి, రైతు, కులకచర్ల

నాపరాయి పరిశ్రమలకు రాయితీలు కల్పించాలి



నాపరాయి పరిశ్రమలకు రాయితీలు కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలి. అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌లో తాండూరు నాపరాయిని ప్రదర్శించేందుకు చర్యలు తీసుకోవాలి. లీజులు, రాయల్టీ విషయాల్లోకర్ణాటక తరహా పాలసీ తాండూరులో అమలు అయ్యేలా చూడాలి. టైల్స్ రాకతో ఎగుమతులు తగ్గాయి. రాయితీలు ఇవ్వకుంటే నాపరాయి పరిశ్రమ మనుగడ కష్టమే.

- అబ్దుల్ రవూఫ్, క్వారీ అసోసియేషన్ అధ్యక్షుడు, తాండూరు

వైద్యం, పంచాయతీ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలి



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలుకుని తెలంగాణ ఆవిర్భావం వరకు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లకు భిన్నంగా ఉండాలి. 2024-2025 బడ్జెట్‌లో పంచాయతీరాజ్, విద్య, వైద్య రంగాలకు భారీగా నిధులు కేటాయించాలి. నేటికీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో గ్రామీణ రహదారుల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. రోడ్లు లేని కారణంగా ఇప్పటికీ అనేక గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. అలాగే గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి పంచాయతీరాజ్ శాఖకు రూ.20వేల కోట్లు కేటాయించాలి. నిరుద్యోగులకు వృత్తి నైపుణ్యంలో ఉచిత శిక్షణ అందించేందుకు రూ.2వేల కోట్లు కేటాయించాలి.

- వంగూరి గంగిరెడ్డి, ఆర్థికవేత్త, షాద్‌నగర్

సాగునీటి రంగానికి ఆసరా అవ్వాలి



ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో బలమైన ఆర్థిక పునాదికి కారణమైన సాగునీటి రంగానికి ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వాలు పెద్దగా నిధుల కేటాయింపులు జరుపలేదు. దీంతో ప్రాణహిత-చేవెళ్ల, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు ముందుకు సాగడం లేదు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 1300 గ్రామాలకు తాగు, సాగు నీటి సమస్య తీరుతుంది. ప్రాజెక్టు నిర్మాణాలు, కాలువలు, చెరువుల అభివృద్ధికి ఈ బడ్జెట్‌లో రూ. 35వేల కోట్లు కేటాయించి సాగు నీటి రంగాన్ని అభివృద్ధి పర్చాలి.

- రవీందర్‌రెడ్డి, ఆర్థికశాస్త్ర అధ్యాపకుడు, షాద్‌నగర్

ముసురుకున్న వాన..!

రంగారెడ్డి అర్బన్, జూలై 24 : ఉమ్మడి జిల్లాను వాన వదలడం లేదు. ఐదు రోజులుగా రోజు ముసురు కురుస్తూనే ఉంది. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలూ కురిశాయి. ఎడతెరి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. వర్షాలు కురుస్తుండటంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో కలెక్టర్ శశాంక జిల్లా వైద్యాధికారులతో సమావేశాన్ని నిర్వహించి ఎప్పటికప్పుడు పలు సూచనలు సలహాలు ఇస్తూనే ఉన్నారు. ముసురు వర్షానికి గ్రామాల్లో అంతర్గత రోడ్లన్నీ కంకర తేలాయి. మట్టి రోడ్లు చిత్తడిగా మారాయి. హైవేలపై ఏర్పడిన గుంతలు ప్రమాదాన్ని తలపిస్తున్నాయి. వర్షం కాస్త ఉరుపునిస్తే.. పంటలు బాగుంటాయంటున్నారు. గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షాన్ని పరిశీలిస్తే.. ఉమ్మడి జిల్లాలోని వికారాబాద్ జిల్లా ముజాహిద్‌పూర్‌లో 17.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లాలోని కేశంపేట మండలం తొమ్మిదిరేకుల గ్రామంలో 16.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

24 గంటల్లో ఉమ్మడి జిల్లాలో నమోదైన వర్షపాతం

జిల్లా	మండలం	ప్రాంతం	నమోదు (మి.మి)
రంగారెడ్డి	కేశంపేట	తొమ్మిదిరేకుల	16.0
	తలకొండపల్లి	వెల్జాల	14.8
	చౌదరిగూడెం	కాసులబాద్	11.0
వికారాబాద్	కుల్కచర్ల	ముజాహిద్‌పూర్	17.5
	కుల్కచర్ల	పుట్టపహాడ్	15.0
	దోమ	దోమ	14.8
	పరిగి	రాపోల్	14.0
	పరిగి	పరిగి	13.0
మేడ్చల్	అల్వాల్	మచ్చబొల్లారం	7.5

(23 ఉదయం 8.30 నుంచి 24 ఉదయం 8.30 గంటల వరకు)

మహిళాశక్తి క్యాంటీన్లు ఏర్పాట్లు చేయాలి

» జిల్లా కలెక్టర్ శశాంక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జూలై 24 : జిల్లాలో మహిళాశక్తి క్యాంటీన్లను ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మైక్రో ఎంటర్ ప్రైజెస్, మీ సేవా కేంద్రాలు, స్టిచింగ్, మహిళా శక్తి క్యాంటీన్, జిల్లా, మండల, గ్రామాల వారీగా మహిళా సమైఖ్య సంఘాల గ్రూప్‌లను ఎక్కువగా ఏర్పాటు చేయాలన్నారు. మహిళా శక్తి క్యాంటీన్‌ల ఏర్పాటు పారదర్శకంగా ఉండాలని అన్నారు. బస్టాండ్ సమీపం, జనాలు ఎక్కువగా రద్దీ ఉన్నచోట గుర్తించి క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శశాంక తెలిపారు. వన మహోత్సవం సందర్భంగా వర్షాకాలంలోనే మొక్కలు నాటే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. మండల అధికారులు, గ్రామస్థాయి స్పెషల్ అధికారులు ఎప్పుడూ అందుబాటులో ఉండి గ్రామంలో రోజువారీ నిర్వహించే పనులను విధిగా నిర్వహించాలన్నారు. తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యంపై ప్రతి రోజూ నివేదికను పంపించాలని డీపీవోను ఆదేశించారు. వైద్యారోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖలు కూడా పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సీజనల్ వ్యాధుల నివారణకు అంకితభావంతో కృషి చేయాలన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, ఎక్కడైనా నీరు నిల్వ ఉన్నట్లు గమనిస్తే ఆయిల్ బాల్స్ వేయాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలని అన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేష్ మోహన్, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, సంక్షేమ శాఖ అధికారి పద్మజా రమణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామేశ్వరీ దేవి, జిల్లా అటవీ అధికారి సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ది స్పిరిచ్యువల్ అనాటమీ పుస్తకాన్ని ఆవిష్కరించిన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, గురూజీ కమలేష్ పటేల్

» మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

» హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురూజీ చారీజీ జయంతి వారోత్సవాల్లో మాజీ రాష్ట్రపతి

ధ్యానంతో మానసిక ప్రశాంతత

నందిగామ, జూలై 24 : ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు శక్తి లభిస్తుందని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతివనంలో రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ మార్గదర్శక గురువుల్లో ఒకరైన చారీజీ మహరాజ్ 97వ జయంతిని వారోత్సవాల్లో బుధవారం రామ్‌నాథ్ కోవింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికత, ధ్యానం ప్రపంచమంతా వ్యాప్తి చెందడానికి హార్ట్‌ఫుల్‌నెస్ ద్వారా చారీజీ ఎంతో కృషిచేశారని అన్నారు. చారీజీ బోధనలు, మార్గదర్శకత్వం అనేక మంది ప్రజల హృదయాల్లో నిలిచిపోయిందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ది స్పిరిచ్యువల్ అనాటమీ పుస్తకాన్ని మాజీ రాష్ట్రపతి, ఆశ్రమ గురూజీ కమలేష్ పటేల్‌తో కలిసి విడుదల చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రంలో వివిధ దేశాల నుంచి, భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యాసికులతో ఆశ్రమంలో పండుగ వాతవరణం నెలకొంది. వారోత్సవాల్లో అభ్యాసికులు సందడి చేశారు. రోజూ నాలుగు సిట్టింగులుగా 30 నిమిషాల పాటు ధ్యానం చేస్తున్నారు. ఆశ్రమంలో నిర్మించిన ధ్యానకేంద్రం విశేషంగా ఆకట్టుకుంటోంది. కన్హా శాంతి వనంలోని పచ్చదనం చాలా బాగుంది. ఈ కార్యక్రమంలో రామచంద్రమిషన్ ప్రతినిధులు, అభ్యాసికులు తదితరులు పాల్గొన్నారు.



రైతు బీమా తప్పక చేయించుకోవాలి

ధారూరు, జూలై 24 : కొత్తగా పట్టా పాస్‌బుక్ పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని క్లస్టర్ ఏఈవో సంజూరాథోడ్ తెలిపారు. రాంపూర్ తండాలో బుధవారం ఆయన బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. 28 జూన్ 2024 వరకు పట్టాపాసుపుస్తకాలు పొందిన రైతులు, ఇంతకు ముందే ఉన్నా రైతు బీమా చేయించుకోని రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రైతు వేదిక వద్ద ఏఈవోలకు దరఖాస్తులివ్వాలన్నారు. పట్టా పాస్‌బుక్, ఆధార్, నామినీ ఆధార్ జిరాక్సులను అందజేయాలని, అలా గే మార్పులు చేర్పులకు 30వ తేదీ వరకు గడువుందని చెప్పారు.







మొదలైన వరినాట్లు

తాండూరు రూరల్, జూలై 24: కురుస్తున్న వానలకు మడికట్లతో నీరు జమవడంతో వరినాట్లు వేస్తున్నారు. తాండూరు మండలం అంతారంతండా, అంతారం, బెల్కటూర్, చింతామణిపట్నం, పర్వతాపూర్, చెంగోల్, సిలిగిరిపేట్, నారాయణపూర్, గోనూరు, వీర్‌శెట్టిపల్లి గ్రామాల్లో వరినాట్లు మొదలయ్యాయి. వర్షాలకు రేగడి భూముల్లో నాలు వేస్తున్నారు. చెంగోల్, మల్‌రెడ్డిపల్లి, సిలిగిరిపేట్, చెనిగేష్‌పూర్, నారాయణపూర్, బిజ్వార్, బొంకూరు చెరువుల్లో నీరు చేరింది. దీంతో బోర్లలో నీటి మట్టం పెరిగింది. మండలంలో మొత్తం 5వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారని ఏవో రజిత తెలిపారు. ప్రస్తుతం బోర్ల కింద వరినాట్లు వేస్తున్నారు.




అంతారం తండాలో నాటు వేస్తున్న కూలీలు. (ఇన్‌సెట్లో) నాటుకు పొలం దున్నుతున్న రైతు

బీజేపీ ఎంపీలు ఆమరణ నిరాహార దీక్ష చేసైనా నిధులు తేవాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్

వికారాబాద్, జూలై 24: ప్రజల ఓట్లతో గద్దెనెక్కిన తెలంగాణ బీజేపీ ఎంపీలు ఆమరణ నిరాహార దీక్షలు చేసైనా సరే ఆంధ్ర, బీహార్ రాష్ట్రాల వలె తెలంగాణాకు కేంద్ర నిధులు తేవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌తో బడుగులకు, రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. బడ్జెట్‌లో బీహార్, ఆంధ్రప్రదేశ్‌లకు నిధులు ఇచ్చినట్టు తెలంగాణకు ఇవ్వలేదన్నారు. ఆరేళ్లలో బీజేపీ పాలకులు చేసిన అప్పు రూ.82లక్షల కోట్లు అని, ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేట్‌కు అప్పగిస్తున్నారని అన్నారు. కేంద్రం విద్య, వైద్యం, వ్యవసాయం, గృహ నిర్మాణం, నిరుద్యోగ నిర్మూలన, రోడ్లుకు భారీగా నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, ఎండీ అక్బర్, నవీన్‌కుమార్, ముత్యం, అరవింద్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల వాడకంపై తనిఖీలు



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మేడ్చల్ టౌన్, జూలై 24 : మేడ్చల్‌లోని దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న దుకాణాల్లో మున్సిపల్ సిబ్బంది బుధవారం తనిఖీలు నిర్వహించారు. సరుకుల ప్యాకింగ్‌కు ప్లాస్టిక్ కవర్లను వినియోగించిన 18 మంది వ్యాపారులకు జరిమానా విధించారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందంఉన్న ప్లాస్టిక్ కవర్లను వాడకం నిషిద్ధం అన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ సిబ్బంది హెచ్చరించారు. తనిఖీల్లో కొన్ని ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ పర్యావరణ ఇంజినీర్ జ్ఞానేశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌చార్జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.











కాశీంపూర్‌లో రిలే నిరాహార దీక్ష చేస్తున్న మల్కాన్‌గిరి గ్రామస్తులు

గ్రామ పంచాయతీ కోసం రిలే దీక్షలు

బషీరాబాద్, జూలై 24: తమ గ్రామాన్ని పంచాయతీగా మార్చాలని మల్కాన్‌గిరి గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార బుధవారం రెండో రోజుకు చేరింది. గ్రామస్తులు మట్లాడుతూ కాశీంపూర్ హామ్లెట్ గ్రామమైన మల్కాన్‌గిరిలో 600పై చిలుకు జనాభా ఉన్నా ప్రభుత్వం కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయడంలేదన్నారు. గతంలో మల్కాన్‌గిరిని జీపీగా ప్రకటించించినా గెజిట్ వెలువడలేదన్నారు. పంచాయతీగా మార్చేవరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో యువకులు బాలక్రిష్ణ, రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు



కుక్కలను పడుతున్న బ్లూక్రాస్ సంస్థ సిబ్బంది

మేడ్చల్ టౌన్, జూలై 24: కొద్ది రోజులుగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ ప్రజలను ఇబ్బంది పెడుతున్న వీధి కుక్కల సమస్యకు మున్సిపల్ అధికారులు చెక్ పెట్టారు. బుధవారం బ్లూ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో అనిమల్ బర్త్ కంట్రోల్, యాంటీ రేబీస్ కార్యక్రమాన్ని చేపట్టి వీధి కుక్కలను బంధించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరి చొరవతో కార్యక్రమాన్ని చేపట్టారు. కుక్కల సంతాన నిరోధానికి, అలాగే యాంటీ రేబీస్ టీకాలు వేశారు. పట్టుకున్న కుక్కలను దూర ప్రాంతాల్లో వదులుతామని అధికారులు పేర్కొన్నారు.

పార్కు స్థలాన్ని కాపాడాలని ఆందోళన



పార్కుస్థలం కాపాడాలని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 24 : పార్కు స్థలం కాపాడాలని అవుషాపూర్ గ్రామస్తులు బుధవారం ఆందోళన చేశారు. అవుషాపూర్‌లోని సర్వే నంబర్లు 253, 255, 256, 263, 264లలో 65 ఎకరాల్లో 1989 న్యూసిటీ పేరుతో వెంచర్ చేశారు. 600ప్లాట్లు చేసి విక్రయించారు. ఆటస్థలానికి 2,400గజాల స్థలాన్ని వదిలిపెట్టారు. వెంచర్ చేసిన జీపీఏ హోల్డర్ లింగారెడ్డి ఆట స్థలాన్ని విక్రయించినట్లు తెలిపారు. ఈ 2,400గజాల స్థలాన్ని కొన్న వ్యక్తి బుధవారం పనులు చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఆటస్థలం కబ్జా చేస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లతామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భిక్షపతిగౌడ్, మాజీ ఉపసర్పంచ్ ఐలయ్య, కొండల్‌రెడ్డి, వామన్‌రెడ్డి, జంగయ్య, శ్రీనివాస్, కుశలవరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



గోట్లపల్లి సమీపంలోని మోడల్ స్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

పెద్దేముల్, జూలై 24:గొట్లపల్లి మోడల్ స్కూల్లో పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. పెద్దేముల్ మండలం గొట్లపల్లి సమీప మోడల్ స్కూల్‌లో పెద్దేముల్, తాండూరు రూరల్ ఎస్సైలు గిరి, అశోక్ పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలు అధికమయ్యాయని, ఈ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. బడీడు బాలలను పనుల్లో పెట్టుకోవడం నేరం అన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా 100కు డయల్ చేయాలన్నారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాలపై వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి శిక్షా సప్తాహ్

కులకచర్ల, జూలై 24: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం మూడో రోజు క్రీడలు నిర్వహించారు. కేజీబీవీలో బాలికలకు పలు క్రీడలు నిర్వహించారు. క్యారం, టేబుల్ టెన్నిస్, ఫుట్‌బాల్, చెస్ తదితర ఆటలు ఆడించారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కూడా సాధించొచ్చని ప్రిన్సిపాల్ దేవి తెలిపారు. మొక్కల పెంపకం, సాంస్కృతిక ప్రదర్శనలు, చారిత్రక కట్టడాల అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కేజీబీవీలో క్యారమ్స్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

డ్రైవర్ల అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

పట్నం డీఎం వెంకట నర్సప్ప



డ్రైవర్ జియావుద్దీన్‌ను సన్మానిస్తున్న డీఎం వెంకటనర్సప్ప, సీఐ సత్యనారాయణ తదితరులు

ఇబ్రహీంపట్నం, జూలై 24: వేగ నియంత్రణ, ఎప్పటికప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డీఎం వెంకట నర్సప్ప అన్నారు. ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూలమలుపుల వద్ద వాహనాన్ని ఓవర్‌టేక్ చేయవద్దన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాన్ని నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రయాణీకుల భద్రత ముఖ్యమనే విషయం డ్రైవర్లు గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా ప్రమాద రహిత డ్రైవర్‌గా గుర్తించిన జియావుద్దీన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్సై రామకృష్ణ, డిపో అసిస్టెంట్ మేనేజర్ రాజేష్, ఎంఎస్ సత్తయ్యలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్డు నిర్మాణ పనులు షురూ

నిధుల మంజూరు, పనులు చేయించడంపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పరస్పర ఆరోపణలు



పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తూర్, జూలై 24: ఎట్టకేలకు కొత్తూర్ ప్రధాన రోడ్డు నిర్మాణం పనులు బుధవారం ప్రారంభమైనాయి. మండల కేంద్రానికి సమీపంలోని వైజంక్షన్ నుంచి స్థానిక జ్యోతిరావు పూలే విగ్రహం చౌరస్తా వరకు రోడ్డు గోతులమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వర్షపునీరు గోతులలో నిలిచి పోవడంతో చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులతో కలిసి గోతులమయంగా మారిన రోడ్డును పరిశీలించారు. వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఈమేరకు బుధవారం రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. 74 ఫీట్ల వెడల్పుతో రోడ్డు, 6ఫీట్ల వెడల్పు డివైడర్‌తో నాలుగు లేన్ల సీసీ రోడ్డును నిర్మిస్తున్నారు. 330మీటర్ల పొడవుతో నిర్మించనున్న రోడ్డుకు దాదాపు రూ.4కోట్ల ఖర్చు అవుతుందని ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. నెల రోజుల్లో రోడ్డును పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఇన్‌చార్జి ఏఈ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, మాజీ ఎంపీపీ జె.వేణుగోపాల్‌గౌడ్, నాయకులు జె.సుదర్శన్‌గౌడ్, వీరమోని దేవేందర్ ముదిరాజ్, జనార్దన్‌చారి, ఇందూరి శ్రీనివాస్, కర్రొళ్ల సురేందర్, చిలకమర్రి నర్సింహ, గోవింద్‌నాయక్ తదతరులు పాల్గొన్నారు.

తమ హయాంలోనే నిధులు మంజూరు

తమ హయాంలో మంజూరైన నిధులతోనే ప్రధాన రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. గోతులమయంగా మారిన రోడ్డును మాజీ ఎమ్మెల్యేతో పాటు, బీఆర్ఎస్ నాయకులు బి.దేవేందర్‌యాదవ్, కడెంపల్లి శ్రీనివాస్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తూర్-షాద్‌నగర్ నాలుగు లేన్ల రహదారి నిర్మాణంలో మంజూరైన నిధులతోనే ప్రస్తుతం రోడ్డు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఒరగపెట్టిందేమీ లేదన్నారు.

కొత్తూర్‌ను నాశనం చేశారు : కాంగ్రెస్

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్తూర్‌ను నాశనం చేశారని కాంగ్రెస్ పార్టీ నాయకులు జె. సుదర్శన్‌గౌడ్, వీరమోని దేవేందర్‌ముదిరాజ్, జనార్ధన్‌చారి, ఇందూరి శ్రీనివాస్‌లు ఆరోపించారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాన రోడ్డును గోతులమయంగా మార్చిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందన్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకుని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వయానా అధికారులతో కలిసి గోతులమయంగా మారిన రోడ్డును పరిశీలించి. ప్రత్యేక నిధులు తీసుకొచ్చారని తెలిపారు. కొత్తూర్ రోడ్డును నిర్మించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

రైతులు మళ్లీ రుణాలు తీసుకోవచ్చు

జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

శంషాబాద్ రూరల్, జూలై 24 : కొత్తగా పట్టా పాసుబుక్‌లు పొందినవారు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి తెలిపారు. బుధవారం ఏడీఏ లీనారెడ్డి, ఏవో కవితతో కలిసి మండల పరిధిలోని శంకరపూర్, సంఘీగూడ, పెద్దగోల్కొండలో రైతులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా గీతారెడ్డి మాట్లాడుతూ కొత్త పట్టాదారులు ఈ నెల 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే గతంలో పట్టా పాసుబుక్‌లు ఉన్న రైతులు వచ్చే నెల 5వరకు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్, లేదా తహసీల్దార్‌తో డిజిటల్ సంతకం ఉంటే సరిపోతుందని చెప్పారు. గతంలో బీమా చేసుకున్న రైతులు బీమాలో మార్పులు, చేర్పులు ఆధార్‌లో మార్పులు నామినీ చనిపోతే మార్పుల కొరకు ఈ నెల 30వ తేదీ చివరిదని చెప్పారు. 14 ఆగస్టు 1964 నుంచి 14 ఆగస్టు 2006 సంవత్సరాల మధ్య పుట్టిన రైతులు మాత్రమే అర్హులని పేర్కొంది. అలాగే రుణమాఫీ పొందిన రైతులు తిరిగి కొత్త రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమె రైతులను కోరింది. రుణమాఫీ కాని కొందరు రైతులు రెండవ దశలో వారికి రుణమాఫీ అవుతుందని చెప్పారు. అలాగే రైతులు పంట వివరాలు ఖచ్చితంగా వ్యవసాయ అధికారులకు తెలిపాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో రాఘవేందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సంఘీగూడలో వివరాలు నమోదు చేస్తున్న గీతారెడ్డి



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

కల్వకుర్తిలో 28న సీఎం రేవంత్ పర్యటన

కొట్ర గేటు వద్ద సూదిని జైపాల్ రెడ్డి విగ్రహావిష్కరణ

కల్వకుర్తిలో బహిరంగ సభ

కలెక్టర్, ఎస్పీలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, జూలై 24: సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 28న కల్వకుర్తి నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. సీఎం పదవి చేపట్టిన అనంతరం తొలిసారిగా నియోజకవర్గానికి వస్తున్న నేపథ్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వెల్దండ మండలం కొట్ర గేటు వద్ద ఏర్పాటు చేసిన కేంద్ర మాజీ మంత్రి, దివంగత సూదిని జైపాల్ రెడ్డి విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్, గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అడిషనల్ కలెక్టర్ సీతారామరావు, ఆర్డీవో శ్రీను నాయక్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీవో చిన్న ఓబులేష్, జైపాల్‌రెడ్డి సోదరుడు సూదిని మనోహర్‌రెడ్డిలతో కలిసి విగ్రహ ఏర్పాటు ప్రాంతాన్ని, సభా స్థలిని ఎమ్మెల్యే నారాయణరెడ్డి బుధవారం పరిశీలించారు. పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జైపాల్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్ ప్రసంగిస్తారని ఎమ్మెల్యే తెలిపారు. జైపాల్ రెడ్డి విగ్రహావిష్కరణ కమిటీ నిర్వాహకుడు సాయిరెడ్డి, నాయకులు భూపతిరెడ్డి, పర్వత్‌రెడ్డి, మోతిలాల్, అశోక్‌రెడ్డి, ఆనంద్, వెంకటేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వైద్య సేవలను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి సేవలపై కలెక్టర్ తనిఖీ

రంగారెడ్డి అర్బన్, జూలై 24 : వనస్థలిపురంలోని ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ శశాంక బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బందితోపాటు పేషెంట్లకు సంబంధించిన వార్డులను పరిశీలించారు. డాక్టర్లు, ఆసుపత్రి పరిసరాలు పార్కింగ్ సమస్య దృష్టికి రావడంతో వెను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. సిబ్బంది విధుల నిర్వహణలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఏరియా ఆసుపత్రి అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలోని సీవరేజ్, డ్రింకింగ్ వాటర్ సమస్యలపై హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్‌ని సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఉన్న రిపేర్లు లిఫ్ట్, మరుగుదొడ్ల నిర్మాణం, అదనపు గదుల నిర్మాణం, సీటీ స్కాన్ అందుబాటులోకి తెచ్చేందుకు టీఎస్ఎంఐడీసీ అధికారులతో చర్చించారు. తనిఖీలో భాగంగా మహేశ్వరం మెడికల్ కాలేజ్‌కు సంబంధించిన డాక్టర్లు, ప్రొఫెసర్లు వారి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో, వెంటనే వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మహేశ్వరం మెడికల్ కాలేజ్ నిర్వహణ కోసం చేపడుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. తనిఖీలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ జి. రాజు యాదవ్, టీఎస్ఎమ్ ఐడీసీ అధికారులు, హయత్‌నగర్ తహసీల్దార్, డాక్టర్లు, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఓలా షోరూంలో ఆందోళనకు దిగిన బాధితులు

'ఓలా' మేనేజర్ ఘరానా మోసం

ఎలక్ట్రికల్ బైక్ షోరూంలో అడ్వాన్స్ బుకింగ్స్ డబ్బులు రూ.15 లక్షలతో పరారీ

లబోదిబోమంటున్న కస్టమర్లు.. పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

శంషాబాద్ రూరల్, జూలై 24 : ఓలా ఎలక్ట్రికల్ బైక్ షోరూం మేనేజర్ ఘరానా మోసానికి పాల్పడ్డాడు. బైకుల అడ్వాన్స్ బుకింగ్ కోసం ఇచ్చిన రూ.15 లక్షల నగదుతో పరారయ్యాడు. ఈ సంఘటన శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని ఉన్న ఓలా ఎలక్ట్రికల్ బైక్ షోరూంలో రెండు నెలల క్రితం నగరంలోని కర్మాన్‌ఘాట్ ప్రాంతానికి చెందిన వర్మ మేనేజర్‌గా చేరాడు. అయితే, అందులో ఎలక్ట్రికల్ బైక్‌ల కోసం ఆరుగురు కస్టమర్లు.. ఒక్కొక్కరు అడ్వాన్స్ బుకింగ్ కోసం 1.48 లక్షలు, మరి కొందరు రూ.40వేలు, రూ.60 వేలు, రూ.70 వేలు ఇలా దాదాపు 20 మంది బాధితులు దాదాపు రూ.15 లక్షల వరకు డబ్బులు కట్టారు. కాగా, వారికి షోరూం నిర్వాహకులు నకిలీ రిసీప్టులు ఇచ్చి మోసం చేశారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు మేనేజర్ పర్సనల్ అకౌంట్లలో డబ్బులు వేయగా.. మరి కొందరు నగదు రూపంలో ఇచ్చినట్లు బాధితులు చెప్పారు. దాంతో బుధవారం బాధితులు షోరూంకు వెళ్లి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న షోరూం నిర్వాహకులు బాధితులకు నచ్చజేపే ప్రయత్నం చేశారు. వారి ప్రయత్నాలు విఫలం కావడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే, రూల్ ప్రకారం కంపెనీకి సంబంధించిన డబ్బులు.. కంపెనీ ఉద్యోగుల ఖాతాల్లో వేయరాదు. కానీ మేనేజర్ అడ్వాన్స్ బుకింగ్ కావాలంటే నా అకౌంట్లోనే వేయాలని బాధితులకు చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాధితులకు న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇచ్చినట్లు ఓలా షోరూం ప్రతినిధి ఒకరు తెలిపారు. త్వరలోనే నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని సీఐ తెలిపారు.

బడ్జెట్‌లో తెలంగాణపై పక్షపాత ధోరణి

మేడ్చల్ టౌన్, జూలై 24: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూపి తన పక్షపాత ధోరణిని మరో సారి ప్రదర్శించిందని మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమణారెడ్డి అన్నారు. బడ్జెట్ కేటాయంపుల్లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ బుధవారం మేడ్చల్‌లో కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. రమణారెడ్డి మాట్లాడుతూ... బడ్జెట్‌లో తెలంగాణ ప్రజల సంక్షేమం గురించి ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర బీజేపీ ఎంపీలు కేంద్ర తీరుపై ప్రజలకు జవాబుదారిగా నిలవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, శేఖర్‌గౌడ్, మహేష్, రుషి, బాల్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, సురేందర్, నరేందర్, శ్రవణ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో ప్రమాదరహిత వారోత్సవాలు



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్

షాద్‌నగర్ అర్బన్, జూలై 24: వాహన డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటేనే ప్రమాదాలను నియంత్రించవచ్చని షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. షాద్‌నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఉష అధ్యక్షతన బుధవారం ప్రమాద రహిత వారోత్సవాలు ప్రారంభమైనాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఆర్టీసీ డ్రైవర్ చేతిలో వందలాది మంది ప్రాణాలు ఉంటాయని గుర్తుచేశారు. డ్రైవర్ శారీరక ధృడత్వం, మానసిక ఉల్లాసం కలిగి డ్రైవింగ్ చేస్తేనే సురక్షితంగా ప్రయాణికులు గమ్యస్థానం చేరుతారన్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోయే కుటుంబాలు రోడ్డున పడతాయని గుర్తుచేశారు. ప్రతీ డ్రైవర్ అప్రమత్తంగా ఉంటూ డ్రైవింగ్ చేయాలని, మద్యం తాగి, పొగతాగుతూ, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఐ అర్జున్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఎస్ఎం అలీ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

తలకొండపల్లి, జూలై 24: రాష్ట్రంలో అన్ని గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించి విద్యార్థులకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు బుధవారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. నూతన భవనాల నిర్మాణానికి బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు లక్ష్మీనివాస్ పేర్కొన్నారు.



మంత్రి ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న లక్ష్మీనివాస్

స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం, జూలై 24: దివ్యాంగులను అవమానపరిచే రీతిలో ఎక్స్(టిట్టర్) వేదికగా మాట్లాడిన సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాల్ల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం చౌరస్తా సాగర్ రహదారిపై నిరసన తెలిపి స్మిత దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల రిజర్వేషన్లపై ఆమె ఈ తీరున మాట్లాడడం తగదన్నారు. అంతేగాక స్మితాసబర్వాల్ మాట్లాడినది ఆమె వ్యక్తిగతమని.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పడం వెనక కుట్రదాగి ఉందన్నారు. ఏదిఏమైనా స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకునే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కె.శ్రీనివాస్, నాయకులు రాజు, బాల్‌రాజ్, గువ్వల యాదయ్య కె.జంగయ్య, సలీం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎండీ రియాజ్

కీసర రూరల్, జులై 24 : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ ఎండీ రియాజ్ అన్నారు. బుధవారం మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన పౌరపఠన మందిరం(రీడింగ్ రూం)ను, మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగని జ్ఞానాన్ని, విషయ పరిజ్ఞానాన్ని గ్రంథాలయాల ద్వార పొందవచ్చన్నారు. జ్ఞానాన్ని ఒక తరం నుండి మరో తరానికి అందించేందుకు గ్రంథాలయాలు దోహదం చేస్తున్నాయన్నారు. గ్రంథాలయ శాఖలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ ప్రజల నుంచి సెస్సు రూపేణ వసూలు చేసిన రూ.72లక్షలు గ్రంథాలయ శాఖకు అందజేసినందుకు మున్సిపల్ చైర్మన్‌ను అభినందించారు. నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ అన్ని మున్సిపాలిటీల్లో, మండల కేంద్రాల్లో, మేజర్ గ్రామ పంచాయతీల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేసేందుకు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ రాజు, నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్, జిల్లా గ్రంథాలయ పరిషత్ కార్యదర్శి సురేష్‌బాబు, మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



నాగారంలో రీడింగ్ రూంను ప్రారంభిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎండీ రియాజ్

వేగంగా హెచ్‌ఎండీఏ చెరువుల హద్దుల గుర్తింపు

గజం కూడా కబ్జా కాకుండా చర్యలు

హైదరాబాద్, జూలై 24: హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) పరిధిలోని అన్ని జల వనరుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ సరిహద్దులు గుర్తించే పనిని వేగవంతం చేసినట్లు హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ హైకోర్టుకు నివేదించారు. రామమ్మకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(ఎన్ఐటీహెచ్ఎం) సంస్థ భవన నిర్మాణాలు చేపడుతుండటంపై హైకోర్టులో గతంలో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. హెచ్ఎండీఏ పరిధిలోని అన్ని జలవనరుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో వివరణివ్వాలని కమిషనర్‌ను ఈ నెల 22న ఆదేశించింది. దీనిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై వివరణ ఇచ్చారు. పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించడంతో పాటు భవిష్యత్తులో గజం భూమి కూడా కబ్జాలకు గురికాకుండా సరిహద్దులు గుర్తించే పనిని వేగవంతం చేశామన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో 3,532 జలవనరులు, చెరువులు, కుంటలున్నాయని, 230 చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులు గుర్తిస్తూ తుది నోటిఫికేషన్ ఇచ్చామని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ప్రాథమిక నోటిఫికేషన్ ఇవ్వని జలవనరులపై తీసుకున్న చర్యల పురోగతి నివేదికను వచ్చే వాయిదా నాటికి సమర్పిస్తామని తెలిపారు.

ఆక్రమణలు నిజమేనన్న ఏజీ

రామమ్మకుంట భూమిలో ఎన్ఐటీహెచ్ఎం సంస్థ కొంత భాగాన్ని ఆక్రమించినట్లు తేలిందని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి అంగీకరించారు. ఈ విషయాన్ని ఏజీ ఉన్నదున్నట్లు చెప్పారని ప్రసంశించిన ధర్మాసనం.. అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్పష్టం చేసింది. విచారణను నవంబరు 4కు వాయిదా వేసింది.



మంచాల : వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చండి

యాచారం/మంచాల, జూలై 24 : ముదిరాజ్‌లను బీసీ-ఏ గ్రూప్‌లో చేర్చడంతో పాటు చెరువులు, కుంటలపై పూర్తి హక్కులు కల్పించి కులవృత్తిని కాపాడాలని ముదిరాజ్ సంఘ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ముదిరాజ్ సంఘ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీకి ఏటా రూ.వెయ్యి కోట్లు నిధులు కేటాయించాలని, జీవోఎంఎస్ నెంబర్ 98,4,6,74లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారుకు ఇచ్చారు. మండల ముదిరాజ్ సంఘ అధ్యక్షులు నీలం శ్రీకాంత్, నాయకులు తదితరులున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ముదిరాజ్‌ల అభ్యున్నతి కోసం పేర్కొన్న అభయహస్తం హామీలను అమలు చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ సంఘం మండలాధ్యక్షుడు సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ముదిరాజ్ మహాసభ నేతలతో కలిసి మంచాల తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అడ్‌హాక్ కమిటీ డైరెక్టర్ దూసవెంకటేష్, నియోజకవర్గ అధ్యక్షుడు గంట భిక్షపతి, ఎంపీపీ జయమ్మ, కావలి ధనుంజయ, తలారి సతీష్, సీహెచ్.చక్రపాణి, నీళ్ల కృష్ణ, లక్ష్మీనర్సింహ, భాస్కర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పేదల గోడు పట్టని పాలకులు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

యాచారం/చేవెళ్ల , జూలై 24 : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రేషన్‌కార్డులు ఇవ్వడం లేదని, ప్రతీ పథకానికి రేషన్‌కార్డు తప్పనిసరి నిబంధన పేరుతో నిరుపేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందకుండా చేస్తున్నారని, పేదల గోడు పట్టకుండా పాలన సాగిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు భాషాలు రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై విరుచుకుపడ్డారు. ఫార్మాసిటీని రద్దు చేయాలని, అర్హులైన వారికి రేషన్‌కార్డులు ఇవ్వాలని తదితర డిమాండ్లతో బుధవారం యాచారం మండల తహసీల్దారు కార్యాలయం ఎదుట బీజేపీ నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్న ప్రభుత్వం.. ప్రతీ పథకానికి రేషన్‌కార్డు తప్పని సరి అని ఎందుకు నిబంధన విధించారని ప్రశ్నించారు. వంట గ్యాస్ రూ.500లకు ఇవ్వడం లేదని, ఇదేంటని పేదలు అడిగితే సాంకేతిక లోపం అని తప్పించుకుంటున్నారని రాష్ట్రప్రభుత్వ విధానాలను తప్పుబట్టారు. రైతులకు రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటనలు చేశారేకానీ.. అసలైన పేద రైతులకు రుణమాఫీ వర్తించలేదన్నారు. మేడిపల్లి ఇండియన్ బ్యాంక్‌లో పంట రుణాలు తీసుకున్న ఏ ఒక్క రైతుకు రుణమాఫీ కాలేదని, ఇదెక్కడి పద్ధతని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో సోకులు తప్ప.. కాంగ్రెస్ పాలకులు నిరుపేదలను ఆదుకోలేకపోతున్నారని ఆందోళన వ్యక్త చేశారు. దివ్యాంగులకు, వితంతులకు పింఛన్ పెంచి ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి.. ఆ విషయం మర్చిపోయారని అన్నారు. ఫార్మాసిటీని రద్దుచేసి తమ నిజాయితీని నిరూపించుకోవాలని రాష్ట్ర సర్కార్‌కు సవాల్ విసిరారు. మహిళలకు ఉచిత రవాణా అంటున్న ప్రభుత్వం.. మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించడం లేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నా ప్రభుత్వానికి పట్టింపులేదని ఆందోళన చెందారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు అయ్యప్పకు సమర్పించారు. ధర్నాలో బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు తాండ్ర రవీందర్, నడికూడి కృష్ణ, నాయకులు కె.పురుషోత్తమ్, ఎస్.యాదయ్య, జి, జంగయ్యగౌడ్, గోగికార్ రమేష్‌జీ, మాజీ సర్పంచ్ ఆర్.విజయ్‌కుమార్, లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్ శ్రీశైలం, శ్రీధర్‌గౌడ్, బీరప్ప తదితరులున్నారు. కాగా, బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీజేపీ చేవెళ్ల మండలాధ్యక్షుడు పాండురంగారెడ్డి తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ పిలుపు మేరకు చేవెళ్ల తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన మాట తప్పిందన్నారు. కాంగ్రెస్ సర్కారుపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు అతెల్లా శ్రీనివాస్, దేవుని శర్వలింగం, అశోక్, కుమార్‌గౌడ్, వైభవ్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సత్యనారాయణ, కృష్ణగౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, చాకలి శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, అబిలాష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



యాచారం : తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కేశంపేట, జూలై 24: మండల పరిధిలోని పాటిగడ్డ గేట్ సమీపంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాటిగడ్డ గ్రామ గేటు బస్ షెల్టర్‌లో దాదాపు 48 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి శరీరంపై నల్లని టీషర్ట్ ఉంది. నలుపురంగు జుట్టు, నలుపు, తెలుపు గడ్డం కలిగి ఉన్నాడని వివరించారు. మృతుడి వివరాలు తెలిసినవారు కేశంపేట పోలీస్‌స్టేషన్ ఎస్సై ఫోన్‌నెంబర్ 9440904759ను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

మైనర్‌తో పని చేయిస్తున్న యాజమానిపై కేసు

ఆదిభట్ల, జూలై 24 : బాలుడితో పని చేయిస్తున్న యాజమానిపై కేసు నమోదు చేసిన సంఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుర్కయాంజాల్‌లో బుధవారం చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలం, బుద్దోయినిపల్లికి చెందిన ముత్యాల శ్రీధర్‌రెడ్డి అబ్దుల్లాపూర్ మెట్, రాగన్నగూడలో నివాసం ఉంటూ తుర్కయాంజాల్ పరిధి వైఎస్సార్ కాలనీలో విజయదుర్గ మన్యూఫాక్చరింగ్ పేరుతో ఫంక్షన్లలో డెకరేషన్ బొమ్మల తయారీ యూనిట్ నడుపుతున్నాడు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా చైల్డ్ ప్రొటెక్షన్ స్మైల్ ఎక్స్ టీమ్ చేపట్టిన తనిఖీలో విజయ దుర్గ మన్యూఫాక్చరింగ్ సంస్థలో పశ్చిమ బెంగాల్ నుంచి వలసవచ్చి వైఎస్సార్ కాలనీలో తల్లిదండ్రులతో కలిసి నివాసముంటున్న 15 ఏళ్ల బాలలో పనిచేయిస్తున్నట్లు సమాచారం అందింది. చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి వి.ప్రవీణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంస్థ యాజమాని ముత్యాల శ్రీధర్ రెడ్డి పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. చైల్డ్ ప్రొటెక్షన్ స్మైల్ ఎక్స్ టీమ్ ఇన్‌చార్జి ఎస్సై సత్యనారాయణ,హెడ్ కానిస్టేబుల్ మురళి, పీసీలు యాదగిరి, సురేష్, విజయలక్ష్మీలు దాడుల్లో పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో దోపిడీ దొంగల బీభత్సం

మొయినాబాద్, జూలై 24 : మొయినాబాద్ మండల కేంద్రంలో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. దర్జాగా కారులో వచ్చి సిమెంట్, స్టీలు దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో సిమెంట్, స్టీలు దుకాణం, పూజా సామగ్రి, జ్యూవెలరీ దుకాణాల షట్టర్ల తాళాలను పగులగొట్టే యత్నం చేశారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని దుండగులు తాళం విరగ్గొట్టే ప్రయత్నం చేశారు. ఈమేరకు వీడియో విజువల్స్ సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంచాయతీరాజ్ ఏఈగా సూర్యవంశీ

● పలువురు పంచాయతీ కార్యదర్శుల నియామకం

యాచారం, జూలై 24 : మండల పంచాయతీ రాజ్‌శాఖ ఏఈగా సూర్యవంశీ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇబ్రహీంపట్నం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఏఈ ఉస్మాన్‌ఖాన్ ఇబ్రహీంపట్నం మండలానికి బదిలీపై వెళ్లారు. కాగా, మండలంలోని తాటిపర్తి, గున్‌గల్, కుర్మిద్ద, గడ్డమల్లాయగూడ, కేస్లీతండా, తక్కళ్లపల్లితండా, తక్కళ్లపల్లి, మొండిగౌరెల్లి, చింతపట్ల, అయ్యవారిగూడ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు బుధవారం మాడ్గుల, మహేశ్వరం, కొత్తూరు మండలాలకు బదిలీ అయ్యారు, గున్‌గల్ పంచాయతీ కార్యదర్శిగా శోభారాణి, అయ్యవారిగూడకు సునిల్‌కుమార్, చింతపట్లకు రవికుమార్ రెడ్డి, గడ్డమల్లాయగూడకు బి.స్వప్న, కుర్మిద్దకు జి.శంకర్‌మహేష్‌కుమార్, మంతన్‌గౌరెల్లికి ఎస్.ప్రశాంత్‌కుమార్, నానక్‌నగర్‌కు ఎ.రమ్య, తక్కళ్లపల్లికి ఇ.గోపాల్‌నాయక్, తాటిపర్తికి బి.శివకుమార్‌లు బదిలీపై వెళ్లి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.

సూపర్‌వైజర్ శ్రీనివాస్ బదిలీ

ఆమనగల్లు, జూలై 24: ఆమనగల్లు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విధులు నిర్వహిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ బుధవారం బదిలీ అయ్యారు. హైదరాబాద్ డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయానికి శ్రీనివాస్‌ను బదిలీ చేస్తూ వైద్యారోగ్య శాఖ ఉత్తర్వులు జారిచేసింది. 12 సంవత్సరాలుగా ఆమనగల్లు ఆసుపత్రిలో శ్రీనివాస్ సూపర్‌వైజర్‌గా సేవలందించారు. పలు మార్లు ఉత్తమ సేవా పతకాలు కూడా అందుకున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష

షాద్‌నగర్, జూలై 24: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపిందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి మద్దతిచ్చిన రాష్ట్రాలకు మాత్రం వేలాది కోట్లు కట్టబెట్టారని విమర్శించారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు బాబర్‌ఖాన్, రఘునాయక్ మీడియాతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు గతంలో కేటాయించిన నిధులను కూడా తగ్గించడం శోచనీయమన్నారు. విభజన అంశాలు, రాష్ట్రానికి ప్రత్యేక నిధులు కేటాయించాలంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి పలుమార్లు ప్రధాని మోదీని కలిసి విన్నవించినా ఫలితం లేదన్నారు. ప్రధాని రాష్ట్రంలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని ప్రకటించినా.. బడ్జెట్‌లో దానికి నిధులు కేటాయించకపోవడం, రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్లు గడుస్తున్నా విభజన హామీలు నేటికీ ఆచరణకు నోచుకోలేదన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించలేదన్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం కోసం రూ.15వేల కోట్లు కేటాయించి తెలంగాణపై వివక్ష చూపడం తగదన్నారు.

పేదల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

చేవెళ్ల, జూలై 24 : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, దేశ ప్రజలకు అన్యాయం చేసిందని సీపీఎం చేవెళ్ల డివిజన్ ఇన్‌చార్జి అల్లి దేవేందర్ అన్నారు. బుధవారం చేవెళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్ర ఊసే ఎత్తని బీజేపీ తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీని నమ్మి 8మంది ఎంపీలను గెలిపిస్తే.. బీజేపీకి తెలంగాణ ప్రజలపై ఎలాంటి ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

గిరిజనుల సంక్షేమానికి రూ.20వేల కోట్లు కేటాయించాలి

కడ్తాల్, జూలై 24: రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో తండాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు, డీసీసీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బీక్య నాయక్ కోరారు. తండాలలో మెరుగైన మౌలిక వసతుల కల్పన, రోడ్ల అభివృద్ధికి ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ. 20వేల కోట్లు కేటాయించాలన్నారు. కడ్తాల మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బీక్యనాయక్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్ ప్రజలందరికీ ఆమోదయోగ్యంగా ఉండడంతో పాటు గిరిజనులకు మేలు చేసేలా ఉంటుందని భావిస్తున్నామన్నారు.

పాటుకాలువ ధ్వంసం, మట్టి తరలింపుపై ఫిర్యాదు



కాలువను పరిశీలిస్తున్న బక్కని

షాద్‌నగర్ అర్బన్, జూలై 24: ఫరూఖ్‌నగర్ మండలంలోని కొండన్నగూడ గ్రామ శివారులోని ప్రభుత్వ అసైన్డ్ భూమిలోని పాటుకాలువ మట్టిని అక్రమంగా తరలించి ధ్వంసం చేశారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండన్నగూడ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 53లో 130 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దాన్ని గతంలో పేదల పేరుతో ఇష్టారాజ్యంగా పంపిణీ చేశారని తెలిపారు. ఒకే కుటుంబంలోని తల్లి, కొడుకులు, కోడళ్ళ పేరున కూడా భూమిని ఇచ్చి అన్యాక్రాంతం చేశారని పేర్కొన్నారు. అట్టి అసైన్డ్ భూమిలో నుంచి కొమ్మొనికుంట చెరువు పాటు కాలువ ఉందని తెలిపారు. పట్టాపొందిన కొందరు రైతులు పాటుకాలువ మట్టిని సైతం అక్రమంగా విక్రయించి, తరలిస్తూ, పాటు కాలువను ధ్వంసం చేశారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిని పొందడమే కాకుండా పాటు కాలువను సైతం ధ్వంసం చేస్తున్న విషయం తెలిసి, బుధవారం సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. కొండన్నగూడ పాటు కాలువ ధ్వంసంపై, చట్ట విరుద్ధంగా పంపిణీ చేసిన భూములపై విచారణ చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు బక్కని నర్సింహులు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



షాబాద్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అపర్ణ

షాబాద్, జూలై 24 : సీజనల్ వ్యాధులు, కురుస్తున్న వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షాబాద్ ఎంపీడీవో అపర్ణ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ అన్వర్, ఏఈలు నరేందర్, దివ్యలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండకుండా తగు జాగ్రలు తీసుకోవాలన్నారు. ఇనుప విద్యుత్ స్థంబాలు, తడిగా ఉన్న విద్యుత్ స్థంబాలను తాకరాదన్నారు. ప్రమాదవశాత్తు పశువులకు విద్యుత్ షాక్‌కు గురైతే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. వర్షాలతో చెరువులు, కుంటలు నిండుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రగా ఉండాలన్నారు. గోరువెచ్చటి నీటిని తాగాలని, జలుబు, జ్వరం ఎంటే వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో హన్మంత్‌రెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

శంకర్‌పల్లి : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రామంతాపూర్‌లో బుధవారం ఆయన పరిసరాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటుగా లోతట్టు ప్రాంతాల పరిశీలన, విద్యుత్ సమస్యలు తదితర వాటిన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెత్తను తప్పనిసరిగా చెత్త బండిలోనే వేయాలని అన్నారు. వర్షాకాలంలో తడిచిన విద్యుత్ స్తంభాలను ముట్టుకోరాదని వివరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు వరద వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కూలడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లలో నివసించరాదని, ఇళ్లు కూలిపోతే తాము ఆశ్రయం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్టు వివరించారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ అశోక్, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వ్యాధులపై జానపద గేయాలతో అవగాహన

కందుకూరు : వర్షాలు నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రతీ ఒక్కరు చర్యలు తీసుకోవాలని జిల్లా కళాకారుల బృందం కందుకూరు గ్రామ పంచాయతీ ఆవరణలో జానపద గేయాల(వీధి నాటకం) ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కలెక్టర్ ఆదేశానుసారం డీపీఆర్వో ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథికి చెందిన 13మందితో కూడిన కళాజాత బృందం గ్రామంలో మూడు గంటల పాటు గ్రామస్తులను ఉత్తేజపర్చారు. కార్యక్రమంలో కళాజాత సభ్యులు ఎ.అనిల్, ఎల్.శ్రీనివాస్, ఎల్.నిఖిలేశ్వర్, ఎం.రాజేశ్వరి, వసంతలక్ష్మి, టి.లక్ష్మి,టి.సునీత, ఎం.జోష్న, సత్యవాణి,(మరియమ్మ), కరుణ, ఎల్.దీక్షిత, కె.అపూర్వ, అమూల్య, జి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి : పిచ్చి మొక్కలను తొలగించాలని సూచనలిస్తున్న కమిషనర్



కందుకూరు : వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మొక్కలు నాటి సంరక్షిద్దాం : భీంభరత్



షాబాద్ : తిర్మలాపూర్‌లో మొక్కలు నాటుతున్న భీంభరత్ తదితరులు

షాబాద్, జూలై 24 : మొక్కలు నాటి పరిరక్షించే బాధ్యత మనందరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని తిర్మలాపూర్‌లో గ్రామస్థులతో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని, మానవ మనుగడకు మొక్కలే కీలకమన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌గౌడ్, మల్లేష్, నర్సింహులు, అశ్వక్‌అలీ, నర్సింహులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపైనే మానవాళి మనుగడ

ఆమనగల్లు : మొక్కల పెంపకంపైనే మానవాళి మనుగడ, పర్యావరణ పరిరక్షణ ఆధారపడి ఉందని పోలెపల్లి మాజీ ఎంపీటీసీ దోనాదుల కుమార్, కౌన్సిలర్ రాధమ్మవెంకటయ్య, జీఎస్ఆర్ యువసేన జిల్లా నాయకుడు చలిచీమల సతీష్‌లు అన్నారు. వన మహోత్సవంలో ప్రజలంత ఉత్సాహంగా పాల్గొని ఉద్యమస్ఫూర్తితో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలో జీఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, జీఎస్ఆర్ యువసేన సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. నాయకులు కోట పెద్ద శ్రీను, శివ, గణేశ్, లడ్డు, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

శంషాబాద్ : వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధి 18వ వార్డులో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని సూచించారు. వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, కమిషనర్ సుమన్‌రావు సిబ్బంది పాల్గొన్నారు.



శంషాబాద్ : మొక్కలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి తదితరులు

హక్కుల సాధనకు కలిసి ఉద్యమిద్దాం

షాద్‌నగర్, జూలై 24: జర్నలిస్టుల హక్కుల సాధన కోసం యూనియన్లకు అతీతంగా ఉద్యమించాలని మెయిన్ స్ట్రీం మీడియా జర్నలిస్టులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం షాద్‌నగర్ పట్టణంలో మెయిన్ స్ట్రీం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల యూనియన్ ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షుడిగా ఎండీ ఖజాపాషా, అధ్యక్షుడిగా మిద్దెల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలంను ఎన్నుకున్నారు. గత కొన్నేళ్లుగా జర్నలిస్టుల మధ్య ఐక్యత లేకపోవడం వల్ల వారికి దక్కాల్సిన హక్కులు దక్కకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఈ మధ్యకాలంలో ఎలాంటి అర్హత లేని వారు కూడా జర్నలిస్టులమని చెప్పుకుంటూ అవినీతికి పాల్పడుతున్నారని, దాంతో షాద్‌నగర్‌లో జర్నలిస్టుల విలువలు మంట కలుస్తున్నాయని ఆరోపించారు. వీరితో పాటు ఫేక్ జర్నలిస్టుల సంఖ్య కూడా నానాటికీ పెరిగిపోతోందని, అలాంటి వారిని గుర్తించి చర్యలకు ఉపక్రమించాలని తెలిపారు. అక్రమంగా డబ్బులు సంపాదన కోసం ఎవరూ కూడా జర్నలిస్టు వృత్తిలోకి రావద్దని హితవు పలికారు. ఈ సమావేశంలో పట్టణంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

500 గ్రాముల గంజాయి పట్టివేత

షాద్‌నగర్ రూరల్, జూలై 24: ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట శివారులో ఎక్సైజ్ పోలీసులు 500 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ సీఐ శేఖర్ కథనం ప్రకారం.. తరుణ్ జోష్ జైన్ అనే వ్యక్తి హైదరాబాద్‌లోని ధూల్‌పేట నుంచి గంజాయి తీసుకువచ్చి ఎలికట్ట శివారులో విక్రయాలు చేపడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈమేరకు బుధవారం దాడి చేసి గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. గంజాయి విలువ రూ.20వేలు ఉంటుందని తెలిపారు.

వెంకట్‌రంగారెడ్డి సేవలు చిరస్మరణీయం



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చేవెళ్ల, జూలై 24 : నిజాం పాలన నుంచి హైదరాబాద్ విముక్తి కోసం పోరాడిన ఉమ్మడి ఏపీ ఉప ముఖ్యమంత్రి కొండా వెంకట్‌రంగారెడ్డి సేవలు చిరస్మరణీయమని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఆంజనేయులుగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి అన్నారు. బుధవారం రంగారెడ్డి వర్ధంతి సందర్భంగా పట్టణ కేంద్రంలోని విగ్రహానికి మండల నాయకులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. అతెల్లా శ్రీనివాస్, ఆశోక్, కుమార్‌గౌడ్, వైభవ్‌రెడ్డి, తదితరులున్నారు.

పని తీరును బట్టే ప్రజల్లో కీర్తి

కడ్తాల్, జూలై 24: పనితీరును బట్టే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో కీర్తి లభిస్తుందని గిరిజన సేవా సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జటావత్ జవహర్‌లాల్ నాయక్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హీరాసింగ్‌లు అన్నారు. మైసిగండి పంచాయతీ కార్యదర్శిగా పదేళ్ల కాలం పనిచేసి బదిలీ అయిన సత్యంను బుధవారం శాలువాలతో సత్కరించారు. నాయకులు తులసీరామ్ నాయక్, యాదగిరి, తదితరులున్నారు.



సత్యంను సన్మానిస్తున్న జవహర్ లాల్, హీరాసింగ్

అట్టహాసంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



కొత్తూర్ : కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, అంజయ్యయాదవ్

ఆమనగల్లు, జూలై 24 : మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు ఆమనగల్లు పట్టణంలో బుధవారం బస్టాండ్ ఎదుట మాజీ జడ్పీటీసీ అనురాధపత్యానాయక్ అధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేష్, కడ్తాల మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు లాలయ్యగౌడ్‌లతో కలిసి కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పాలు, పండ్లు పంపిణీ చేశారు. రఘు, నిరంజన్‌గౌడ్, తదితరులున్నారు.

కడ్తాల్ : మండల కేంద్రంలోని మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ నివాసం వద్ద కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. దశరథ్ నాయక్, ఉప్పల వెంకటేష్, గంప వెంకటేష్, జీఎల్ ఎస్ రెడ్డి, ఆనంద్‌లు అతిథులుగా హాజరయ్యారు. కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. కడారి రామకృష్ణ, చంద్రమౌళి, ముజుబుర్ రహెమాన్, తదితరులున్నారు.

తలకొండపల్లి : మండలం కేంద్రంతో పాటు వెల్జాలలో కేటీఆర్ జన్మదిన వేడుకల్లో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, శ్రీకాంత్, నరేందర్‌గౌడ్, యాదయ్య, భాస్కర్, శ్రీరామ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : కేటీఆర్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, సోషల్‌మీడియా మండల కన్వీనర్ బొక్క దీక్షిత్‌రెడ్డిల ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్ రెడ్డి కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. సీనియర్ నాయకులు తాండ్ర దేవేందర్, ప్రకాశ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ/కొత్తూర్ : కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్.నవీన్‌కుమార్‌రెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, బీఆర్ఎస్ నాయకులు నగరంలో కేటీర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తూర్‌లోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో అంజయ్యయాదవ్ మొక్కలు నాటి, విద్యార్థినిలకు పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమాల్లో కొత్తూర్, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్లు లావణ్యదేవేందర్ యాదవ్, నరేందర్, బీఆర్ఎస్ నాయకులు వి.నారాయణరెడ్డి, ఈట గణేష్, కడెంపల్లి శ్రీనివాస్, యాదయ్య, సోమ్లనాయక్, జె. శ్రీను, మెండె కృష్ణ, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : కేటీఆర్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో నిర్వహించారు. చేవెళ్ల నియోజకవర్గం సీనియర్ నాయకులు దేశమోళ్ల ఆంజనేయులు, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో చేవెళ్ల మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేసి కేక్ కట్ చేశారు. చేవెళ్ల మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి నరేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింలు, నారాయణ, మాజీ డైరెక్టర్లు, మాజీ సర్పంచ్‌లు, మండల యూత్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులున్నారు.

కేశంపేట : కేటీఆర్ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం ముందు కేక్‌కట్ చేసి పార్టీ శ్రేణులకు ఒకరికొకరు తినిపించుకున్నారు. కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటారు. కేశంపేట, కొత్తపేట మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, నవీన్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గు : కేటీఆర్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని జీఎం పటేల్ గార్డెన్‌లో నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. విశ్వనాథ్‌పూర్‌లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలో మొక్కలు నాటారు. మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, ఎదిర రామకృష్ణ, దర్గా రాంచంద్రయ్య, తదితరులున్నారు.

షాద్‌నగర్ రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల, లింగారెడ్డిగూడ, సోలీపూర్ గ్రామాల్లో కేటీఆర్ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. పాఠశాలల్లో మొక్కలు నాటారు. సోలీపూర్ పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ నరెందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీఆర్ఎస్ యువ నాయకుడు మురళీ కృష్ణ యాదవ్ నోట్‌పుస్తకాలు పంపిణీ చేసి మొక్కలు నాటారు. వైస్ చైర్మన్ నటరాజ్, నాయకులు రఘునాథ్ యాదవ్, రవి యాదవ్, తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం : కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోభానగర్‌లోని స్ఫూర్తి జ్యోతి అంధుల ఆశ్రమంలో బీఆర్ఎస్ నాయకులు దివ్యాంగులతో కేక్ కట్ చేయించి సంబరాలు జరుపుకున్నారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా బీఆర్ఎస్ నాయకులు ఆశ్రమానికి 5సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు భరత్‌రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రాజు, నాయకులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : కేటీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని శంకర్‌పల్లి సొసైటీ చైర్మన్ శశిధర్‌రెడ్డి అన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నాయకులతో కలిసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

శంకర్‌పల్లి : చిన్న పిల్లలను పనిలో పెట్టుకోరాదని శంకర్‌పల్లి సీఐ హబీబుల్లాఖాన్ హెచ్చరించారు. శంకర్‌పల్లిలో ముస్కాన్ ఆపరేషన్‌లో భాగంగా దుకాణాల్లో పనిచేస్తున్న ఐదుగురు పిల్లలను గుర్తించారు. పిల్లలకు కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపించేశారు. దుకాణదారులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

షాద్‌నగర్ అర్బన్ : ఆషాఢ మాసం సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని వినాయక గంజ్‌లోని విఘ్నేశ్వరుడికి షాద్‌నగర్‌కు చెందిన మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజలు పూజచేసి, తీర్థప్రసాదాలను అందించారు. మున్సిపల్ చైర్మన్ నరేందర్, తదితరులున్నారు.

ఆమనగల్లు : బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కుడుముల శ్రీనివాస్‌రెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి మృతిపట్ల రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఈమేరకు చౌక్కన్నపల్లిలో భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.